క్లుప్తంగా

ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీ డీకే అరుణతో బాబయ్య, తదితరులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను షాద్‌నగర్ బీజేపీ నేతలు కలిశారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు హైదరాబాద్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆమెను కలిసి ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, నాయకులు వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న గురుస్వాములు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వాములు ఇరుముడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వామి గిరిషన్‌నాయర్ ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్ము కృష్ణ, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన



స్వయంపాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ గాయత్రి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, పట్టుదలతో చదివి మంచి భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సత్యమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ రాజరత్నం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజరత్నం

కేశంపేట: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ రాజరత్నం అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, మండల విద్యాధికారి చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత, ఏఈ (పంచాయతీరాజ్) నర్సింగ్ రావు, నాయబ్ తహసీల్దార్ గీత పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

చేవెళ్ల: నేటి సమాజంలో విద్యార్థులు, యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని షాబాద్ సీఐ కాంతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సీఐ, చేవెళ్ల ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులను పరిచయం చేసుకొని పోటీలను వారు ప్రారంభించారు. గెలుపొందిన విద్యార్థులకు స్వామి వివేకానంద జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

కొత్తగా మరో రెండు జీపీలు!

- పంచాయతీలుగా అవతరించనున్న చంద్రాయన్‌గూడ, సంఘీగూడ
- మండలంలో 21కి చేరనున్న సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామస్తులు



జీపీగా ఏర్పాటు కాబోతున్న సంఘీగూడ

నందిగామ: నందిగామ మండలంలో మరో రెండు గ్రామాలు నూతన గ్రామ పంచాయతీలుగా అవతరించబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నూతన జీపీల ఏర్పాటులో భాగంగా జిల్లాలో 22 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కాబోతుండగా నందిగామ మండలంలో నూతనంగా 2 గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన మండలాల ఏర్పాటులో భాగంగా కొత్తూరు మండలం నుంచి నందిగామను విడదీసి 10 గ్రామ పంచాయతీలతో నందిగామను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా నందిగామ మండలంలో ఉన్న 10 గ్రామ పంచాయతీలలో 8 అనుబంధ గ్రామాలను సైతం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మొత్తం 18 గ్రామ పంచాయతీలకు చేరాయి. చేగూరు గ్రామ పంచాయతీలోని అనుబంధ గ్రామాలు వెంకమ్మగూడ, బండోనిగూడ, బుగ్గోనిగూడ, తాళ్లగూడ, కన్హాలను విడదీసి ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఈదులపల్లికి అనుబంధ గ్రామంగా ఉన్న మోత్కులగూడను, వీర్లపల్లికి అనుబంధంగా ఉన్న అప్పారెడ్డిగూడలను, మామిడిపల్లికి అనుబంధంగా ఉన్న మొదళ్లగూడను, మంచన్‌పహాడ్‌ను కలిపి మొదళ్లగూడ గ్రామ పంచాయతీగా, దీంతో పాటు మరో అనుబంధ గ్రామం శ్రీనివాసులుగూడను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. రంగాపూర్‌కు అనుబంధ గ్రామంగా ఉన్న చాకలిగుట్టతండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు.

కోర్టు ఆదేశాలతో అంతిరెడ్డిగూడ..

నందిగామ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న జంగోనిగూడ, అంతిరెడ్డిగూడ గ్రామాలను కలుపుకొని అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో జంగోనిగూడను కలుపుకొని అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని, జంగోనిగూడతో కూడిన అంతిరెడ్డిగూడను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు రావడంతో అంతిరెడ్డిగూడ సైతం గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. దీంతో నందిగామ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి.

తాజాగా చంద్రాయన్‌గూడ, సంఘీగూడలు

మండల కేంద్రమైన నందిగామకు అనుబంధంగా ఉన్న చంద్రాయాన్‌గూడ, మేకగూడ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న సంఘీగూడ గ్రామాలు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం నందిగామ గ్రామ పంచాయతీలో 14 వార్డులకు గాను 7,442 మంది జనాభా ఉన్నారు. ఇందులో చంద్రాయన్‌గూడలో 639 మంది ఉన్నారు. నందిగామ గ్రామ పంచాయతీ నుంచి చంద్రాయన్‌గూడను విడదీసి 639 మంది జనాభాతో చంద్రాయన్‌గూడను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయనున్నారని విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా మేకగూడలో 10 వార్డులకు గాను 2,703 మంది జనాభా ఉన్నారు. సంఘీగూడలో 582 మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం మేకగూడ నుంచి సంఘీగూడను విడదీసి 582 జనాభాతో సంఘీగూడను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు. దీంతో నందిగామ మండలంలో గ్రామ పంచాయితీల సంఖ్య 21కి చేరుకోనుంది. ఎన్నో ఏళ్లగా తమ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజల కోరిక నెరవేరబోతుండటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



చంద్రాయన్‌గూడ, సంఘీగూడ గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రాతిపాదనలు పంపిన మాట వాస్తవమే. ఆ రెండు గ్రామ పంచాయితీలు ఏర్పాటు విషయమై తొందర్లోనే అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

–సుమతి, ఎంపీడీఓ

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



చేవెళ్ల: మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ముడిమ్యాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావులపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో రావులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు కేసారం శ్రీనివాస్, బాల్‌రాజులతో పాటు వారి అనుచరులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

షాబాద్: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల పర్యటనలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి షాబాద్ మండల పరిధిలోని అంతారం నుంచి మన్‌మర్రి మీదుగా పరిగి రోడ్డుకు కలిసే విధంగా పనులు చేయాలని, ఈ రోడ్డును పీఆర్ నుంచి ఆర్అండ్‌బీలోకి మార్చి బీటీరోడ్డు వేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

రోడ్డు విస్తరణకు నిధులివ్వండి

మొయినాబాద్: ఇటీవల పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి మార్చిన కవేలిగూడ–చందానగర్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. బుధవారం చేవెళ్ల మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్తున్న మంత్రికి మొయినాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనస్వాగతం పలికారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విజయ్‌కుమార్

షాబాద్: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలవాలని ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ కొండ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 64 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు మల్లికార్జున్, షఫీ, అడ్డూ, రాకేశ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



సామూహిక హోమాల్లో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: శ్రీనివాస శ్రీ వెంకటేశ నామస్మరణతో వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం మార్మోగింది. బుధవారం మండలంలోని కనకమామిడి గ్రామ సమీపంలో గల హైదరాబాద్–బీజాపూర్ రహదారి పక్కన ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాలు మొదటిరోజు 108 కలషాభిషేకం, సుప్రభాతంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి పల్లకీసేవ నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు మహా మంగళహారతి సమర్పించారు. విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో వ్యాపారవేత్త మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేశ్, బల్వంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువారం ఆలయంలో తిరు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, నిర్వాహకులు ఈశ్వర్‌రెడ్డి, అర్చకుడు నరేంద్రచారి తెలిపారు. ఇందుకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మా గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దు

ఎమ్మెల్యేకు ఆయా గ్రామ నాయకుల వినతి



ఎమ్మెల్యేకు సమస్యను విన్నవిస్తున్న గ్రామస్తులు, నాయకులు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండలంలోని 8 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. బుధవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, ఆయా గ్రామాల ప్రజలు మా గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దని ఎమ్మెల్యే కలసి విన్నవించారు. మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీలే ముద్దు, మా గ్రామాలను జీపీలుగానే ఉంచాలని కోరారు. మున్సిపాలిటీగా మార్చడంతో గ్రామాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ విజయ్‌కుమార్



సీఐ, ఎస్ఐని సన్మానిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుల నిఘాతో సమానమని, నేరాలను అదుపు చేయడంలో అవి ఎంతో దోహదపడతాయని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు రూ.75వేలను అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటుగా ముఖ్య కూడళ్లలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామపెద్దల ఏకగ్రీవ తీర్మానంతో గ్రామంలో శాశ్వత మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తుండటం అభినందనీయమన్నారు. మద్యపాన నిషేధాన్ని ఎవరూ ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ బలరాంను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అనంతం, రఘురామ్, శ్రీనివాస్, రాజు, శ్రీధర్‌రెడ్డి, సామెల్, జంగయ్య, బాల్‌రాజ్, గణేశ్, యాదయ్య, పెంటయ్య, గిరి, శ్రీధర్, బాబా పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: సీపీఐ పార్టీ వంద వసంతాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న నిర్వహించే పార్టీ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం కార్యదర్శి కె. రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలను నిర్వహించకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 28వ తేదీన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా వంద వసంతాల ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేవంలో నాయకులు పి.పర్వతాలు, ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్, జంగయ్య, సుధాకర్‌గౌడ్, అంజయ్య, శివ, వెంకటయ్య, మీనాక్షి, వెంకటమ్మ, జయమ్మ, రాజు, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్: పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న అభినందనీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత నిధులతో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసినందుకు బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయానికి ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న 800 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అదేవిధంగా దాతల సహకారంతో కళాశాల నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దశరథ్, కేశవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: మండలంలోని ఉత్తరాసిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని మహదేవ్‌పూర్, బైరంపల్లి, ఉత్తరాసిపల్లి, టేకులపల్లి, చుక్కమెట్టు, ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, ఆయా గ్రామాల వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

జీవన నైపుణ్యాలపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

షాబాద్: వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఫౌండేషన్‌వారి సహకారంతో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కన్హాశాంతి వనంలో బుధవారం వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ ప్రారంభించారు. నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి విద్యార్థుల భవితను తీర్చిదిద్దాలని, అందుకుగాను ఈ రెండు రోజుల శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది ఉపాధ్యాయులు పాల్గొని, వివిధ రకాలైన భాగస్వామ్య, కృత్యాధార పద్ధతుల ద్వారా శిక్షణాంశాలు చేర్చుకున్నారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, శిక్షణ ఫౌండేషన్ ట్రైనర్స్ కాశీనాథ్, అప్పారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

కేశంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఎంపీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో రూ.10లక్షల విలువతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరసహకారంతోనే పనులకు నిధులు మంజూరయ్యాయని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రమేశ్, ధనుంజయ్, రాంచంద్రరెడ్డి, అంజయ్య, నర్సింలు, చాకలి రమేశ్, పర్వతాలు, యాదమ్మ, రాజు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ నేతల తీరు సరికాదు’

శంకర్‌పల్లి: నగరంలోని నాంపల్లి బీజేపీ కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ నేతలు దాడి చేయడాన్ని శంకర్‌పల్లి బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నేతలు తమ తీరును మార్చుకోవాలన్నారు. శంకర్‌పల్లిలో బుధవారం నాయకులు మాట్లాడుతూ.. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే స్పందన మరో విధంగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలి

సేవాలాల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘురాంరాథోడ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు, గిరిజనులు

కేశంపేట: సేవాలాల్ ఆశయ సాధనకు గిరిజనులు కృషి చేయాలని సేవాలాల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘురాం రాథోడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దేవునిగుడితండాలో గిరిజన నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాఘురాంరాథోడ్ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి సేవాలాల్ ఎనలేని కృషి చేశారన్నారు. లంబాడీ, బంజారాల ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్, యూత్ అధ్యక్షుడిగా గణేశ్, వర్కింగ్ అధ్యక్షుడిగా లచ్చిరాం, సెక్రటరీగా లక్ష్మణ్, శ్రీను, జాయింట్ సెక్రటరీగా బాబ్యు, యూత్ ప్రధాన కార్యదర్శిగా నగేశ్‌ను ఎంపిక చేసి నియమాకపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేఖ్యానాయక్, సేవాలాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాత్లావత్ రవినాయక్, రాము, సేవ్య, శ్రీకాంత్, రమేశ్, మేగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్రీడాకారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్–5 టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందుర్గు మండలం క్రీడలకు అడ్డాగా మారిందని, పోటీలు నిర్వహించడంలో ముందుంటుందని కొనియాడారు. యువత ఎంతో ఆసక్తిగా ప్రతి సంవత్సరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఇందుకోసం కొందుర్గు మండలానికి మినీ స్టేడియం మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడంతో గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం బయటికి వస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఒలంపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండా విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని అప్పోజీగూడ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడలో కేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుర్వగూడ గ్రామ మాజీ సర్పంచ్ సంధ్యామల్లికార్జున్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో షాద్‌నగర్‌కు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామంలోని ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరం ఉన్నవారిని ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు గ్రామస్తులు ఉన్నారు.